

# న్యాయమూర్తుల నియామకాల్లో ఇంత జాప్యమా?

- కొలీజియం సిఫారసులు ఏమయ్యాయి?
- మొత్తం న్యాయవ్యవస్థనే నిలిపేయాలని చూస్తున్నారా?
- కేంద్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

దిల్లీ: న్యాయమూర్తుల నియామకాలు, బదిలీలలో జాప్యం నెలకొనటంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మొత్తం న్యాయవ్యవస్థను 'స్తంభింపజేయాలని' ప్రభుత్వం ప్రయత్నిస్తోందా? అని నిలదీసింది. కొలీజియంపై అపనమ్మకమెందుకని ప్రశ్నించింది. పెండింగు కేసులు, న్యాయమూర్తుల ఖాళీలు పెరుగుతుండటంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణ (మిగతా 6లో)

# న్యాయమూర్తుల నియామకాల్లో ఇంత జాప్యమా?

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. "కొలీజియం 75 మంది హైకోర్టు న్యాయమూర్తుల (బదిలీలు/ నియామకాలకు) పేర్లను సిఫారసు చేసింది. కానీ వాటికి ఆమోదం తెలపలేదు. ఈ దస్త్రాలు ఎక్కడ, ఎందుకు నిలిచిపోయాయో తెలియదు. ఇలాంటి ప్రతిష్టంభనను మేం సహించం" అని భారత ప్రధాన న్యాయమూర్తి టి.ఎస్.ఠాకూర్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం పేర్కొంది. "మేం సిఫారసు చేసిన పేర్ల విషయంలో ఏదైనా అభ్యంతరముంటే దస్త్రాన్ని తిరిగి వెనక్కి పంపండి. దాన్ని పరిశీలిస్తాం. ఇలాంటి ప్రతిష్టంభనతో మొత్తం పరిస్థితి విషమిస్తోంది" అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని అత్యున్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని, ఎలాంటి నోటీసు జారీచేయొద్దని అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ కోరారు. దీనికి భారత ప్రధాన న్యాయమూర్తి ఠాకూర్ స్పందిస్తూ.. కొలీజియం సిఫారసులకు సంబంధించిన దస్త్రాలు ఎక్కడున్నాయో అడిగేలా, న్యాయపరంగా జోక్యం చేసుకునేలా తమను బలవంతం చేయొద్దని ఘాటుగా వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థ స్తంభింప చేయటానికి ప్రయత్నించొద్దని, అది మంచి పని కాదని హితవు చెప్పారు. పిల్‌పై విచారణ సందర్భంగా.. హైకోర్టుల్లో న్యాయమూర్తుల ఖాళీలు, అపరిష్కృత కేసుల సంఖ్య పెరుగుతున్న విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. "హైకోర్టుల్లో ఖాళీలు 43 శాతానికి పెరిగాయి. హైకోర్టుల్లో 40 లక్షల కేసులున్నాయి. మొత్తం వ్యవస్థ కుప్పకూలుతోంది" అని పేర్కొంది. న్యాయమూర్తుల నియామకాల ప్రక్రియ కోసం ప్రభుత్వం ముసాయిదా పత్రాన్ని రూపొందించే పనిలో ఉండొచ్చు గానీ ఆ పేరుతో నియామకాలను నిలిపేయటం క్షమార్హం కాదంది. పిల్‌పై స్పందించటానికి అటార్నీ జనరల్‌కు నాలుగు వారాల సమయం ఇచ్చింది.